గ్రామ స్వరాజ్యం..అస్తవ్యస్తం!

- నిర్వీర్యమవుతున్న సచివాలయ వ్యవస్థ
- గతంలో 545 సేవలు అందుబాటులో
- నేడు.. గందరగోళ పరిస్థితి
- పని లేక ఖాళీగా ఉద్యోగులు
- నూతన పింఛన్లు, రేషన్ కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డుల వెబ్‌సైట్ తెరుచుకోని వైనం
- అవస్థల్లో ప్రజలు


కడమకుంట్లలో ఒకే ప్రాంగణంలో నిర్మించిన గ్రామ సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్‌సెంటర్

మండలాలవారీగా సచివాలయాలు, ఉద్యోగుల వివరాలు..

మండలం	పంచాయతీలు	సచివాలయాలు	సచివాలయ ఉద్యోగులు
తుగ్గలి	23	18	128
మద్దికెర	8	9	60
పత్తికొండ	17	19	150
కృష్ణగిరి	16	14	115
వెల్దుర్తి	23	18	130

తుగ్గలి : గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్య స్థాపనకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం కృషి చేసింది. గ్రామ, వార్డు సచివాలయాలు, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ఉద్యోగులు, వలంటీర్లను నియమించి ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసింది. అయితే కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ వ్యవస్థకు తూట్లు పొడుస్తోంది. ఇప్పటికే వలంటీర్ వ్యవస్థను కుదేలు చేసిన కూటమి సర్కార్..సచివాలయాల వ్యవస్థను కూడా నిర్వీర్యం చేసేందుకు పథకం పన్నింది. జగనన్న పాలనలో సచివాలయాల ద్వారా 545 సేవలు అందేవి. నేడు ఆ పరిస్థితి లేకుండా పోయింది. అంతా గందరగోళంగా మారింది. ప్రభుత్వం ఏర్పడి నాలుగు నెలలు దాటినా..రేషన్ కార్డులు, కొత్త పింఛన్లు, ఆరోగ్యశ్రీ కార్డుల వెబ్‌సైట్లు ఇంత వరకు ఓపెన్ కాలేదు. ఫలితంగా అనేక మంది దరఖాస్తుదారులు అవస్థలు పడుతున్నారు.

సచివాలయ ఉద్యోగులే దిక్కు..

నాడు కూటమి ప్రభుత్వం నేతలు ప్రతిపక్షంలో ఉన్నప్పుడు సచివాలయ ఉద్యోగుల పట్ల వివక్షతో అనేక విమర్శలు చేశారు. అవహేళనగా మాట్లాడారు. కానీ నేడు కూటమి సర్కార్‌కు పింఛన్లు పంపిణీకి సచివాలయ ఉద్యోగులే పెద్ద దిక్కయ్యారు. అంతేకాక ఇటీవల కూటమి ప్రభుత్వం చేపట్టిన 'ఇది మంచి ప్రభుత్వం' కార్యక్రమంలో స్టిక్కర్లు అతికించే దగ్గర నుంచి..ఇంటింట ప్రచారం వరకు వీరినే ఉపయోగించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. నోటికి వచ్చిన అబద్ధపు హామీలను నేతలు ప్రజలకు వాగ్దానాలు చేసి.. గద్దెనెక్కిన కూటమి సర్కార్..సూపర్ సిక్స్‌ను తుంగలో తొక్కింది. వాటి అమలుపై ప్రజలు ఎక్కడ నిలదీస్తారో..ప్రశ్నిస్తారోనని.. రోజుకొక సమస్యను సృష్టించి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తోందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తిరుమల శ్రీవారి లడ్డూ వివాదాన్ని తెరపైకి తెచ్చి కొంత కాలం వెళ్లదీసింది. అయితే అది తప్పుడు ప్రచారమని తేలిపోవడంతో ప్రజల్లో ప్రభుత్వంపై నమ్మకం మరింత సడలింది. ప్రభుత్వం ఏర్పడి ఐదు నెలలు కావస్తున్నా సూపర్ సిక్స్ అమలు కాకపోవడంతో ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

నాడు కళకళ..నేడు వెలవెల..

గత ప్రభుత్వం రెండు వేల జనాభా ఉన్న గ్రామంలో రూ.40 లక్షలతో సచివాలయం, రూ.21 లక్షలతో రైతు భరోసా కేంద్రం, రూ.20.80 లక్షలతో హెల్త్ సెంటర్, రూ. 17.94 పాల కేంద్రాలు ఏర్పాటు చేసింది. కొన్ని నెలల క్రితం వరకు వివిధ సంక్షేమ పథకాల అమలుతో ప్రజలు, లబ్ధిదారుల రాకపోకలతో కళకళలాడిన సచివాలయాలు నేడు వెలవెలబోతున్నాయి. నియోజకవర్గంలో మొత్తం 87 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. 78 సచివాలయాలు ఉండగా అందులో 583 మంది సచివాలయ ఉద్యోగులు ఉన్నారు. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను నిర్వీర్యం చేయడంతో సేవలందక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు ఉద్యోగులు పని లేక ఖాళీగా ఉండాల్సిన పరిస్థితి. కేవలం నెల ప్రారంభంలో పింఛన్లు పంపిణీ మాత్రమే చేయిస్తోంది. సంక్షేమ పథకాల అమలు లేకపోవడం, సేవలు నిలిచిపోవడంతో కార్యాలయాలకు ప్రజలు రావడం లేదు.

వెబ్‌సైట్లు ఇంకా ఓపెన్ కాలేదు

సచివాలయాల్లో పింఛన్లు, రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ దరఖాస్తుకు వెబ్‌సైట్లు ఇంకా ఓపెన్ కాలేదు. వెబ్‌సైట్లు ఎప్పుడు ఓపెన్ చేస్తారనే దానిపై సమాచారం లేదు. ప్రభుత్వం దరఖాస్తుకు అనుమతి ఇచ్చినప్పుడు వెంటనే అమలయ్యేలా చూస్తాం. సచివాలయాల ఉద్యోగాల వినియోగంపై ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుంది. ఉన్నతాధికారులు, పాలకుల సూచన మేరకు నడుచుకుంటాం.

– విశ్వమోహన్, ఎంపీడీఓ, తుగ్గలి

క్లుప్తంగా

దేవరగట్టులో ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో మాళ మల్లేశ్వరస్వామి మూలమూర్తులు

హొళగుంద: దేవరగట్టులో ఆదివారంమాళ మల్లేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయంలో మూల విరాట్‌లకు జలాభిషేకాలు, సుప్రభాతసేవ, భండారార్చన, కుంకుమార్చన, మహామంగళ హారతి, ఆకుల అలంకరణతో పాటు ఇతర ప్రత్యేక పూజలను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు.స్థానికులే కాకుండ కర్ణాటక నుంచి భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

చెన్నకేశవస్వామి ఆలయ అభివృద్ధికి విరాళం


విరాళం అందజేస్తున్న డిప్యూటీ కలెక్టర్ వెంకటేశ్వర్లు

దేవనకొండ: స్థానిక శ్రీ లక్ష్మీసమేత చెన్నకేశవ స్వామి ఆలయ అభివృద్ధికి అనంతపురం జిల్లా డిప్యూటీ కలెక్టర్ ఎన్.వెంకటేశ్వర్లు ఆదివారం రూ.50,116 విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయంలో స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయన మాట్లాడుతూ.. గతంలో ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేశానని, ఆ తర్వాత ఆయా మండలాల్లో తహసీల్దార్‌గా పనిచేసి పదోన్నతిపై అనంతపురం జిల్లా డిప్యూటీ కలెక్టర్‌గా బదిలీ అయ్యానని చెప్పారు. గ్రామస్తులు డిప్యూటీ కలెక్టర్‌ను శాలువా, పూలమాలతో సన్మానించారు. జెడ్పీటీసీ రామకృష్ణ, టీచర్ రంగస్వామి, వేణుమహారాజ్, నరసారావు పాల్గొన్నారు.

దేవాలయ నిర్మాణానికి విరాళం

చిప్పగిరి: హొళగుంద మండల కేంద్రంలో నూతనంగా నిర్మించనున్న ఈరన్న స్వామి ఆలయ నిర్మాణానికి రూ.15వేలను ఎమ్మెల్యే బుసినె విరూపాక్షి ఆదివారం చిప్పగిరిలో అందజేశారు. దీంతో ఆలయ నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తూ కృతజ్ఞతలు తెలిపారు.

22 నుంచి ఆధార్ శిబిరాలు

మద్దికెర : మండలంలోని గ్రామాలలో ఈనెల 22 నుంచి 25 వతేదీ వరకు 4 రోజుల పాటు ఆయా గ్రామ సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని ఎంపీడీఓ కొండయ్య ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ..కొత్త ఆధార్ డాక్యుమెంటరీ, బయోమెట్రిక్ అప్‌డేట్ వంటి వాటిని చేస్తారని చెప్పారు. గ్రామాల వారీగా.. 22వ తేదీ బసినేపల్లి, 23న పెరవలి, 24న హంప, 25న ఎడవలి శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే 22, 23వ తేదీల్లో రెండు రోజుల పాటు ఎం.అగ్రహారం, 24, 25వ తేదీల్లో బురుజుల గ్రామ సచివాలయంలో శిబిరం ఉంటుందని, ఆయా గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వాల్మీకి జీవితం మానవాళికి ఆదర్శం


అమకతాడులో వాల్మీకి ఆలయ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న దృశ్యం

కృష్ణగిరి: కవిగా, మానవతావాదిగా ఎదిగిన రామాయణ మహాకావ్య రచయిత వాల్మీకి మహర్షి జీవితం ఆధునిక మానవాళికి ఆదర్శమని మాజీ ఎంపీటీసీ మధుసూదన్‌నాయుడు అన్నారు. మండలంలోని అమకతాడు గ్రామంలో ఆదివారం వాల్మీకి మహర్షి దేవాలయ నిర్మాణానికి వాల్మీకులు భూమి పూజ చేశారు. వారు మాట్లాడుతూ గ్రామంలోని వాల్మీకులందరు ఐకమత్యంగా నూతన దేవాలయ నిర్మాణానికి ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బాలు, ధనుంజయ, హనుమంతు, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

22 నుంచి భజన పోటీలు

గోనెగండ్ల : మండల కేంద్రంలో వెలసిన శ్రీ చింతలాముని, నల్లారెడ్డి స్వాముల నెల పూజ సందర్భంగా భజన పోటీలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం పూజారులు తెలిపారు. ఆదివారం వారు విలేకరులతో మాట్లాడుతూ భజన పోటీలు 22వ తేదీ రాత్రి 10 గంటలకు ప్రారంభమవుతాయన్నారు. భజన పోటీలలో పాల్గొను బృందముల వారు అదే రోజు రాత్రి 8 గంటల లోపు ప్రవేశ రుసుం రూ.500 చెల్లించి ఆలయంలో పేరు నమోదు చేసుకోవాలన్నారు. విజేతలకు వరుసగా తొమ్మిది స్థానాల్లో 30 తులాల వెండి, 20 తులాలు, 15 తులాలు, 10 తులాలు, 8 తులాలు, 5.1/2 తులాలు, 5 తులాలు, 2.1/2 తులాలు, 2 తులాల వెండి బహుమతులను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. వివరాలకు సెల్: 9912050356, 9885637504 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ఆర్థిక సాయం

హొళగుంద: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన పంచాయతీ కార్మికుడు మల్లికార్జున శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం విషయం తెలుసుకున్న పంచాయతీ సెక్రటరీ రాజశేఖర్, స్థానిక నాయకుడు పంపాపతి మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి అంతిమ సంస్కారాలకు గాను రూ.5 వేల నగదు అందజేసి మృత దేహంపై పూలమాల ఉంచి నివాళులర్పించారు.

నూతన కమిటీ ఎన్నిక

హాలహర్వి: ఎమ్మార్పీఎస్ తాలూకా అధ్యక్షుడు కత్తి రామాంజనేయులు, మండల అధ్యక్షుడు వీరేష్ ఆధ్వర్యంలో ఆదివారం స్వచ్ఛభారత్ కార్మికుల సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రేమరాజు, ఉపాధ్యక్షుడిగా మాల రామంజిని, గౌరవాధ్యక్షుడిగా సుంకప్ప, కోశాధికారిగా గోవిందుతో పాటు మరో పది మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్మికులకు ప్రతి నెలా జీతం అందించాలని, ఉద్యోగ భద్రత కల్పించాలని వారు డిమాండ్ చేశారు.

25 వరకు ఓపెన్ స్కూల్ అడ్మిషన్లు

ఆదోని సెంట్రల్: ఓపన్ స్కూల్ అడ్మిషన్లకు ఈ నెల 25వ తేదీ వరకు ఎలాంటి అపరాధ రుసుము లేకుండా గడువు పెంచినట్లు ఓపన్ స్కూల్ కో ఆర్డినేటర్ మల్లికార్జున ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఏవైనా కారణాలతో మధ్యలో చదువు ఆపేసిన వారికి సార్వత్రిక విద్యా పీఠం ఓపెన్ స్కూల్(అపాస్) 10వ తరగతి, ఇంటర్మీడియెట్ చదువుకోవడానికి మంచి అవకాశం కల్పిస్తుందన్నారు. 10వ తరగతిలో అడ్మిషన్ కాదలచిన వారికి 14 ఎళ్లు, ఇంటర్మీడియెట్‌లో అడ్మిషన్ కోసం 15 ఏళ్లు నిండి ఉండాలన్నారు. ఆసక్తి ఉన్నవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

గ్రామాల్లో అభివృద్ధి పనులు


బొమ్మిరెడ్డిపల్లెలో సీసీ రహదారి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న అధికారులు, నాయకులు

వెల్దుర్తి(కృష్ణగిరి): పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టినట్లు ఎంపీడీఓ సుహాసినమ్మ తెలిపారు. మండలంలోని బోయినపల్లి, రత్నాపల్లి, బొమ్మిరెడ్డిపల్లె గ్రామాల్లో ఆదివారం అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఆమె మాట్లాడుతూ నేటితో కార్యక్రమాలు ముగిసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈ మల్లికార్జున, ఈఓఆర్డీ రవికిషోర్, ఏపీఓ లక్ష్మన్న, నాయకులు కాంతరెడ్డి, నాగేశ్వర రెడ్డి, సుబ్బరాయుడు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కృష్ణగిరిలో..

మండలంలోని ఆగవేలి గ్రామంలో ఆదివారం పీఆర్ ఏఈ జాకీర్‌హుసేన్ ఆధ్వర్యంలో సీసీ రహదారుల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. ఏపీఓ నాగ సులోచన, వెంకటేష్, రాముడు, చిన్న వెంకటేష్, రాజు ల్గొన్నారు.

తుగ్గలి : పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఉప్పర్లపల్లి, ఎల్లమ్మగుట్ట తండా, రోళ్లపాడు తండాల్లో అధికారులు, నాయకులు సీసీ రోడ్ల నిర్మాణాలకు భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఏపీఓ హేమసుందర్, ఈసీ ప్రదీప్, నాయకులు అప్పా వేణుగోపాల్, శ్రీనివాసులుగౌడ్, తిరుపాల్ నాయుడు,ప్రసాద్, మనోహర్, వెంకటరాముడు, తులసీ నాయక్, ప్రతాప్, చాంద్, మైరాముడు పాల్గొన్నారు.

హొళగుంద: మండల ంలోని హొన్నూరుకొట్టాల, హొళగుందలో పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా ఆదివారం ఆలూరు టీడీపీ ఇన్‌చార్జ్ వీరభద్రగౌడ్ పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. హొళగుంద నుంచి హొన్నూరు కొట్టాల వరకు రూ.4.70 కోట్లతో 5 కి.మీ బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేశారు. అలాగే హొళగుందలో కోటవీధి, దిడ్డీకాలనీని, ఈబీసీ, బీసీ కాలనీలు, మహంకాళమ్మ వీధి తదితర కాలనీల్లో రూ.50 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులకు భూమి పూజ చేశారు. నాయకులు మిక్కిలినేని శివప్రసాద్, రాజ పంపన్నగౌడ్, పంపాపతి, దిడ్డి వెంకటేష్, ఎర్రిస్వామి, దుర్గప్ప, పీఆర్ ఏఈ యమునప్ప, ఏపీఓ భక్తవత్సలం పాల్గొన్నారు.


బాపనదొడ్డి సమీపంలో విరగబూసిన కంది పూత

కళకళలాడుతున్న కంది

కృష్ణగిరి: ఈ ఏడాది ఖరీఫ్‌లో సాగు చేసిన కంది పంట ఆశాజనకంగా ఉంది. వర్షాలు సమృద్ధిగా పడుతుండటంతో పంట ఏపుగా పెరిగింది. ప్రస్తుతం పంట పూత దశలో ఉంది. ఆకుపచ్చని పంటకు పసుపు పచ్చని పూతతో కళకళలాడుతోంది. కాగా.. వర్షాలు తగ్గకపోతే పంట దిగుబడి తగ్గే అవకాశం ఉందని రైతుల ఆందోళన చెందుతున్నారు. మండల వ్యాప్తంగా దాదాపుగా 4వేల ఎకరాలకు పైగా కంది పంట సాగు చేసినట్లు అధికారులు తెలిపారు.

రోడ్డు మరమ్మతు పనుల పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విరుపాక్షి

చిప్పగిరి: ఆలూరు – కర్నూల్ రోడ్డు మరమ్మతు పనులను ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ తీవ్ర వర్షాల కారణంగా రోడ్డు మొత్తం గుంతలమయంగా మారడంతో సమ్యను జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా దృష్టికి తీసుకెళ్లగా.. గ్రావెల్ వేయడానికి అనుమతులు మంజూరు చేశారని చెప్పారు. పనులు నాణ్యతగా చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. నాయకులు వీరేష్, బుసినె వెంకటేష్ పాల్గొన్నారు.

విద్యుత్ ప్రమాదాలపై అప్రమత్తంగా ఉండాలి

కృష్ణగిరి: ఎడతెరపి లేకుండా వర్షాలు పడుతుండటతో విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా రైతులు, గృహ వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని ట్రాన్స్‌కో ఏఈ మద్దిలేటి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ.. వర్షాలకు రైతులు తమ పొలాల్లోని విద్యుత్ బోర్డులో ఉన్న స్విచ్ఛ్‌లను తడిచేతులతో ఆన్ చేయరాదని, ఇంట్లో అతుకుల విద్యుత్ తీగలు ఉంటే వాటిని ఎలక్ట్రీషియన్‌తో మార్చుకోవాలన్నారు. రహదారుల వెంట ఉన్న విద్యుత్ స్తంభాలు, సపోర్టు వైరును ఎట్టి పరిస్థితుల్లోనూ తాకరాదని చెప్పారు. విద్యుత్ తీగ సర్వీస్ వైరుకు సపోర్టుగా వాడుకునే జీ వైరుకు ప్లాస్టిక్ తొడుగు ఉండేలా చేసుకోవాలన్నారు. ఎవరైనా విద్యుత్ షాక్‌కు గురైతే రక్షించడానికి లోహపు వస్తువులు వాడదాదన్నారు. వ్యవసాయ పంపెసెట్లకు, స్టార్టర్లకు విధిగా ఎర్తింగ్ పెట్టుకోవాలని, వర్షానికి ఎక్కడైనా తీగలు తెగిపడినా ఇతరత్రా సమస్యలు తలెత్తినా వెంటనే విద్యుత్ అధికారులకు తెలియజేయాలని సూచించారు.

ఉచిత బస్సు ప్రయాణం హామీ అమలు చేయాలి


మహిళా ప్రయాణికులతో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

చిప్పగిరి: కూటమి నాయకులు ఎన్నికల హామీల్లో భాగంగా సూపర్‌సిక్స్ పథకాల్లో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తామని ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు చిప్పగిరి లక్ష్మీనారాయణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం ఆలూరు నుంచి గుంతకల్లు వెళ్లే బస్సులో ప్రయాణించి పోస్టు కార్డు ఉద్యమం పై మహిళలకు వివరించి మహిళా ప్రయాణికుల నుంచి పోస్టు కార్డులపై సంతకాలు సేకరించారు. వారు మాట్లాడుతూ సంతకాలు చేసిన పోస్టు కార్డులను ముఖ్యమంత్రి కార్యాలయానికి పంపుతామని తెలిపారు. లక్ష్మన్న, మంజునాథ్, గోవిందు, వీరాంజనేయులు,నారాయణ,బాషా పాల్గొన్నారు.

మూడేళ్ల క్రితం తండ్రి.. ఇప్పుడు తల్లి

- గుండె పోటుతో ఇద్దరూ మృతి
- అనాథలైన ముగ్గురు చిన్నారులు


తల్లి మృతదేహం వద్ద విలపిస్తున్న చిన్నారులు

పత్తికొండ(తుగ్గలి) : మూడేళ్ల క్రితం తండ్రి గుండె పోటుతో మృతి చెందగా..ఇప్పుడు తల్లి మృతి చెందడంతో ఆ చిన్నారులు అనాథలయ్యారు. పత్తికొండ మండలంలోని చందోలి గ్రామానికి చెందిన తుప్పటి లక్ష్మి (34)కి 15ఏళ్ల క్రితం తుగ్గలి మండలం మారెల్లకు చెందిన అంజినయ్యతో వివాహం జరిగింది. వీరికి జయశ్రీ (13), అంకిత (10), ఉషశ్రీ (5) కూతుళ్లు ఉన్నారు. కూలీ నాలీ చేసుకొని జీవనం సాఫీగా సాగుతున్న సమయంలో మూడేళ్ల క్రితం అంజినయ్య గుండెపోటుతో మృతి చెందాడు. దీంతో లక్ష్మి పుట్టినిల్లు చందోలికి వచ్చింది. తల్లిదండ్రులు కూడా లేకపోవడంతో సమీప బంధువు దగ్గర ఉంటూ కూలీ పనులకు వెళ్తూ పిల్లలను పోషిస్తోంది. ఆదివారం పొలం పనులకు వెళ్లిన లక్ష్మి.. ఇంటికి వచ్చిన కాసేపటికే గుండె పోటుతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న స్థానికులు ఆస్పత్రికి తీసుకెళ్లేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతి చెందింది. లక్ష్మి మృతితో ముగ్గురు చిన్నారులు దిక్కులేనివారయ్యారు. ఈ ఘటనతో గ్రామస్తులు కన్నీటి పర్యంతమయ్యారు.

ఘనంగా మాబుసుభాని ఉరుసు

కోసిగి : స్థానిక రంగప్పగట్టు వద్ద వెలసిన మాబు సుభాని ఉరుసు వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. దర్గా నిర్వాహకులు చందాఉసేన్ కుమారుడు గౌస్ పీరా తాత ఆధ్వర్యంలో ప్రత్యేక ఫతేహాలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి హిందూ, ముస్లింలు కులమతాలకు అతీతంగా తరలి వచ్చి దర్గాను దర్శించుకుని ప్రత్యేక ఫాతెహాలు చేసుకున్నారు. అన్నదానం ఏర్పాటు చేశారు.

రోడ్డును బాగు చేయండి

మద్దికెర : మద్దికెర – పత్తికొండ రోడ్డు అస్తవ్యస్తంగా ఉందని, బాగు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యుడు రామకృష్ణ, మండల కార్యదర్శి రవికుమార్ డిమాండ్ చేశారు. ఆదివారం మద్దికెర నుంచి పత్తికొండకు వెళ్లే ప్రధాన రహదారిని పరిశీలించారు. అరగంట ప్రయాణానికి గంటకు పైగా పడుతుందన్నారు. వర్షం కురిస్తే గుంతల లోతు తెలియక వాహనదారులు ప్రమాదాలబారిన పడుతున్నారని చెప్పారు. వెంటనే రోడ్డును బాగు చేయాలని కోరారు.

కుంగిన రోడ్డు


మధ్యలో కుంగిన రోడ్డు

హొళగుంద: మండలంలోని అగ్రహార ఆంజనేయ స్వామి ఆలయానికి వెళ్లే రోడ్డు కుంగిపోయింది. కురుస్తున్న వర్షాలకు రోడ్డు అధ్వానంగా తయారైంది. మెకాలోతు గుంతలు పడి కంప చెట్లు రోడ్డుకు అడ్డంగా పెరగడంతో అటు వైపు తిరిగే భక్తులు, రైతులు, ముద్దటమాగి గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం కురిస్తే గుంతలను తప్పించేందుకు ప్రయాణం సర్కస్‌ను తలపిస్తూ నరకాన్ని చూపుతోందని వాపోతున్నారు. అధికారులు కనీసం గ్రావెల్ వేసి గుంతలు కూడా పూడ్చక పోవడంపై భక్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఎల్లెల్సీ నుంచి ఆలయం వరకు రోడ్డుకు మరమ్మతులు చేయాలని కోరుతున్నారు.

వర్షం మిగిల్చిన నష్టం


మారెల్ల వద్ద తడిసిన ఉల్లిని ఆరబెట్టుకుంటున్న రైతు


చెన్నంపల్లి వద్ద వర్షానికి కుళ్లిన వేరుశనగ

తుగ్గలి : కురుస్తున్న వర్షాలు రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. ఆరుగాలం కష్టపడి పండించిన పంట చేతికొచ్చిన సమయంలో వర్షానికి దెబ్బతిని అన్నదాత కుదేలవుతున్నారు. బంగాళఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా నాలుగు రోజులుగా వర్షం కురుస్తోంది. దీంతో చాలా చోట్ల కోతలు కోసిన వేరుశనగ, ఉల్లి వర్షానికి తడిసి కుళ్లిపోయాయి. తడిసిన ఉల్లిని ఆరబెట్టు కునేందుకు రైతులు నానా అవస్థలు పడుతున్నారు. వేరుశనగ కట్టె వర్షానికి కుళ్లిపోవడంతో పశుగ్రాసం పాడైంది. కొద్దిసేపు తెరిపిస్తే ఆరబెట్టుకునేందుకు సిద్ధమవుతున్న రైతన్నకు ఉన్నట్టుండి వర్షం కురుస్తుండడంతో వారి కష్టాలు వర్ణనాతీతం. కాస్తయినా పంటను కాపాడుకునే క్రమంలో కూలీల ఖర్చు తడిసి మోపెడవుతోందని వాపోతున్నారు. పెట్టుబడులు, కూలీల ఖర్చు కూడా రావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.


గుంతలమయంగా బోయబొంతిరాళ్ల - బొందిమడుగులకు వెళ్లే ప్రధాన రహదారి

రోడ్లు ఛిద్రం..ప్రయాణం నరకం


ఎరుకలచెర్వు - ఆగవేళికి వెళ్లే రహదారి దుస్థితి


పాడైన కృష్ణగిరి - ఎస్‌హెచ్ ఎర్రగుడికి రహదారి

కృష్ణగిరి: మండలంలోని ప్రధాన గ్రామాల మధ్య రహదారులు పూర్తిగా దెబ్బతిన్నాయి. భారీ వర్షాలకు తోడు పరిమితికి మించి లోడుతో వాహనాలు వెళ్లతుండటంతో రహదారులు ఛిద్రమయ్యాయి. దీంతో ఈ దారుల్లో ప్రయాణం వాహనదారులకు నరకం చూపుతోంది. ఎస్‌హెచ్ ఎర్రగుడి కృష్ణగిరి వచ్చే రహదారిలో నిత్యం అక్రమంగా ఇసుక తరలిస్తుండటంతో రహదారులు పూర్తిగా పాడవుతున్నాయి ప్రజలు ఆరోపిస్తున్నారు. అలాగే తొగర్చేడు నుంచి వెల్దుర్తికి వెళ్లే రహదారి, ఎరుకలచెరువు నుంచి ఆగవేలి వెళ్లే దారి, బోయబొంతిరాళ్ల నుంచి తుగ్గలి మండలం బొందిమడుగుల వెళ్లే ప్రధాన రహదారులన్నీ దెబ్బతిన్నాయి. ఈ రహదారులకు మరమ్మతులు చేపట్టాలని మండల ప్రజలు కోరుతున్నారు.


వెల్దుర్తి - తొగర్చేడు రహదారి దుస్థితి